

ఎందుకొచ్చిన గొడవ, ఇంక్రిమెంటు ఇచ్చెయ్యండి. అలా తప్పని సరి అయి ఇస్తే ఎగుడు దిగుడుగా యివ్వండి. పక్షపాతం చూపండి. ఐదారేళ్ళపాటు ఇంక్రిమెంటాలిటీ తలెత్తకుండా ఇది టీకాల మల్లే పని చేస్తుంది.

గమనిక

ఇంతవరకు మీరు చదివినది ఉగాదినాడు మీ ఉబుసుపోకకోసం రాసిన అభూత కల్పన. అంతేకాని, నిజంగా ఇలాంటివి జరుగుతాయని కాదు. పొరపాటున ఇందులోంచి గుమ్మడికాయ లేవైనా వాటంత టవి ఎగిరిపడితే పక్కవాళ్ల బుజాలు తడవండి.

ఓడిపోయిన మనిషి

బాలగంగాధర తిలక్

తెరచి ఉన్న కిటికీలోంచి వొంటిమీద జల్లుపడి చటుక్కున మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి కిటికీలోంచి చూశాను. సన్న చినుకులతో వాన. గాలి మాత్రం తీవ్రంగా వీస్తోంది. సగం నలుపూ, సగం తెలుపూ గల తెలవారగట్ల సన్నని చినుకుల దారాలు గాలిలో కదలిపోతున్నాయి, చెదరిపోతున్నాయి. ప్రహారీ గోడ దగ్గర మందార చెట్టు పువ్వులు ఎర్రగా వానలో తడుస్తున్నాయి. చల్లని గాలికి వొళ్ళంతా ఏదో హాయిగా వుంది. చల్లదనం మనస్సులోకి వెళ్ళి బాధ్యతల్నీ, సమస్యల్నీ, భయాల్నీ దాచుకున్న వేడి నెరిబెల్లానికూడా చల్లపరుస్తోన్నట్టు అనిపించింది.

కళ్ళు మూసుకున్నాడు. ఎవరో మంచు కొండలమీద స్కేటింగ్ చేస్తోన్న దృశ్యం. విశాఖపట్నంలో డాల్ఫిన్స్‌నోస్ దగ్గర తెల్లని ఓడ కదలుతూన్న దృశ్యం. మద్రాస్ కాలేజి ఆవరణలో ఎవెన్యూలో నడుస్తూన్న దృశ్యం. ఈ మూడింటికీ ఏదైనా సంబంధం వుందా? హాయిలో హాయి అనే పరుపులో నన్ను నేను చుట్టబెట్టుకున్నట్టు ఏదో ఫీలింగ్; ఈ ఫీలింగ్‌ని పోనివ్వకూడ దనుకుంటూనే వొళ్ళు ముడుచుకుంటూ, కళ్ళు మూసు కుంటూ చల్లని వానని మనసులో కురిపించు కుంటూ, చెయ్యి పక్కకి జాపాను. మెత్తగా ముదురుగా లావుపాటి పాత రబ్బరులాగ చేతికి తగిలింది. అంతవరకూ పక్కమీద నా పక్కనే సుభద్ర పడుకుని వుందన్న మాట మరిచిపోయాను. పంద్రెండేళ్ళ క్రితం తాకగానే కొత్త ఉద్రేకాలూ, రహస్యాలూ నాలో ప్రసరింప చేసిన యీమె శరీరం, యిన్నేళ్ళ పరిచయంలో, అనుభవింపబడ డంలో, పిల్లల్ని కనడంలో వయస్సు పెరిగి యీనాడు ఆకర్షణని కోల్పోయి "ఇల్లాలు" అనే ఒక వ్యర్థ గౌరవపదమైపోయిన యీమె శరీరం, నా చేతికి తగలగానే వానా, వేకువా, మందార చెట్టూ గబుక్కున మాయమైపోయాయి.

వాటిస్థానే పెళ్ళికి ఎదుగుతూన్న ఆడ పిల్లా, టాన్సిల్స్ ఆపరేషన్ చేయింపవలసిన చిన్న కొడుకూ, బ్యాంకిలో తరిగిపోతూన్న డబ్బూ, ఎప్పుడూ రిపెయిర్స్ కొచ్చే కారూ వచ్చి నిలుచున్నాయి. కాసేపు కూడా

కల్పనా సుఖాన్ని ఊహించుకో నివ్వని కఠిన వాస్తవికతలా కనపడింది భార్య. ఆమెవైపు తిరిగి చూశాను. వొంటిమీద సగం సగం బట్టతో, రేగినజుట్టుతో గృహిణీ ధర్మాన్ని రోజంతా నిర్వహించిన అలసట కనుపించే కను రెప్పలతో, లావెక్కి వొంపులు మాయమైపోయిన వొంటితో జాలి గా కనుపించింది. ఏదో బాధ అనిపించింది. ఎవరో నన్ను దగా చేస్తున్నా రనిపించింది. మంచి ట్యూన్ వినిపించే రేడియో గొంతుని ఎవరో నొక్కేసి వికటంగా నవ్వినట్టనిపించింది. ప్రథమ యౌవన దినాలు లీలగా జ్ఞాపకం వచ్చాయి. సుతారపు అత్తరువాసన లాంటి జ్ఞాపకాలు—ఆ రోజులు!

మళ్ళీ అటు తిరిగి పడుకున్నాను. చల్లని గాలి మొహానికి తగులుతోంది. వెనక్కి వెళ్ళిపోతున్నాను—ముదిరిన ఏళ్ళ పర్వతాల మీదనుంచి వెనక్కి వెనక్కి లోయల్లోకి, పచ్చిక బయళ్ళలోకి వెళ్ళిపోతున్నాను. రొమాన్సూ, ఆదర్శాలూ, అమాయికత్వం కలిసిన వేడి వేడి రక్తం. పడుచు పిల్లలన్నా, కవిత్వం అన్నా, సోషలిజం అన్నా బలే బలే యిష్టం. జేబు నిండా డబ్బూ, సినిమాలూ షైలా పచ్చీసుగా వుండేది. భావ కవిత్వం మీదా, సుభాష్‌బోస్ నాయకత్వం మీదా మోజు. ఇంగ్లీషు వాళ్ళన్నా, ఉద్యోగస్తులన్నా చిరాకూ, ద్వేషమూ.

ఆ వయస్సులోనే చిన్న చిన్న రొమాన్సులు ప్రారంభం. రెండు కలువ రేకుల లాంటి కళ్ళుగాని, చివరకి—జవ్వాడే నడుం మీద నాట్యంచేసే వాల్జడగాని కవిత్వంలోకి పంపివేసేది. సామ్రాజ్య వాదాన్ని, సంప్రదాయాన్ని ఎదిరించాలనే సాహసం. కాని మరి కొంచెం ఎదిగేటప్పటికి నాకు తెలియకుండానే ఎన్నో జాగ్రత్తలు వచ్చి కూర్చున్నట్టు తెలుసుకున్నాను. లోపల—నా లోపల ఎవడో పెద్దమనిషీ బుద్ధిమంతుడూ అయినవాడు పరివ్యాప్త మౌతున్నాడు, మెడచుట్టూ కండువా వేసుకుని, కొంచెం వొంగి, కర్ర నానుకుని జీవితాన్ని భద్రంగా యిటూ అటూ చెదరిపోకుండా తాళం వేసుకుంటున్నాడు. బాలని ప్రేమించాను. అలాగని చెప్పాను కూడా. అయినా చివరికి ఏమీ ఎరగనట్టుగా తప్పుకున్నాను. పెళ్ళి పందిట్లో ఆ రాత్రి నేను తలనొప్పితో విడిది మేడగదిలోనే పడుకున్నాను. అందరూ పందిట్లో వున్నారు. పెట్రోమాక్సు లైటు ఆరిపోయింది. కిటికీ లోంచి వెన్నెల పడుతోంది. మెట్లమీద చప్పుడు వినపడింది. ఎవరా అని చూశాను, బాల! కళ్ళని కాటుకతో, బుగ్గ మీద చుక్కతో బాల. నాదగ్గరికి వచ్చి తట్టి లేపింది. ఏమీ ఎరగనట్టుగా "ఎవరూ?" అన్నాను.

"నేను బాలని," ఆమె గొంతులో బాధ, ఆవేశం. "రేపు వుదయమే నాకు పెళ్లి అయిపోతోంది."

నేను మాట్లాడ లేకపోయాను.

"ఏం నిద్రపోతున్నావా" అంది.

"లేదు."

"ప్రేమించాననీ, పెళ్లి చేసుకుంటాననీ అన్నావు. పల్లెటూరి పిల్లనని, ప్రతీమాటా నమ్ముతాననీ, ఏం చేసినా ఊరుకుంటాననీ అను కున్నావా?"

".... ...."

"ఏం మాట్లాడవేం?"

"అదికాదు బాలా, ఇలా జరుగుతున్నందుకు నేనెంత బాధ పడుతున్నానో దేవుడికి తెలుసును."

"మరి—?"

"మావాళ్లెవరికీ యిష్టంలేదు. మీ కుటుంబానికీ మాకూ శత్రుత్వ ముందిట. మీ చిన్నాన్న మా నాన్నని చంపడాని కొచ్చాకుట."

"ఇదివరకు నీకు తెలియదా?"

"తెలియదు."

"అది జరిగి యిరవై ఏళ్ళయింది. ఇప్పుడు దెబ్బలాటలు లేవుగా, ఒకరిళ్ళ కొకరు వస్తున్నారు, మాట్లాడుకుంటున్నారు...."

"అయినా మావాళ్లెవరికీ యిష్టంలేదు."

"మీవాళ్ళంటే....?"

"మా నాన్న, అమ్మా, మా అక్కయ్య అన్నయ్య, మా మేనత్త.... ఆఖరికి మా పాలేరుకి కూడా."

"అయితే యీ పళంగా ఎక్కడికేనా పారిపోదాం. నా వంటిమీద నాల్గు వేల బంగారం వుంది. నిన్ను వొదిలి వుండలేను"

"ఛ-ఛ యిప్పుడెలాగ. నలుగురూ ఏమనుకుంటారు?"

ఆమె ఏడుస్తూ కూర్చుంది. బాల చాలా అందమైనది. అదొక విలక్షణమైన ఉజ్వలమైన అందం. అటువంటి అందం అన్ని చోట్లా కనుపించదు. నాకు బాధగా వుంది. నిజమే కాని ఎంతమందిని ఎదిరించి, ఎన్ని అడ్డంకుల్ని దాటి, నా భవిష్యత్తుని ఏం చేసి యీమెని నా దాన్ని చేసుకోగలను? కోపంతో మరీ ఎరుపెక్కిన జీరలు కల కళ్లుకల నాన్న మొహం, నిరసనతో చూసే అమ్మ మొహం. పద్దెనిమిది వేల కట్నంతో జడ్జిగారి సమ్మంధం, రాజకీయంగా వేసుకున్న ప్లానులు.... యివన్నీ ఏమౌతాయి.?

"కిందికి వెళ్ళిపో బాలా. ఎవరేనా వొస్తారు." అన్నాను.

బాల కోపంగా లేచి నుంచుంది. వెన్నెల రేకలో ఆమె పెదవి వణకడం కూడా కనపడింది. కోపమూ ఏడుపూ కలిసిన కంఠంతో "నూతిలోపడి చద్దామను కున్నాను. కాని తప్పు నీదికాదు. నువ్వు మగవాడివి కాదు. నీకన్న ఏ వెధవైనా వెయ్యిరెట్లు నయం." అని విసవిస వెళ్ళిపోయింది. స్తంభించిపోయిన నా లోపల్లోపల యీ సమస్య యిలా పరిష్కారమైనందుకు సంతోషించానో, ఆమె దూరమై పోతూన్నందుకు బాధపడ్డానో నాకు తెలియలేదు.

నాలుగేళ్ళ అనంతరం ఆమె చాలాజబ్బుతో జనరల్ ఆస్పత్రిలో వుందని తెలిసి మనసు పట్టలేక వెళ్ళాను. నర్సు వచ్చి "మిమ్మల్ని చూడడానికి వీల్లేదంది ఆమె. మిమ్మల్ని పంపించి వెయ్యమంది" అని చెప్పింది. నర్సుతో బతిమి లాడాను. ఆమె నా వల్లనే నా కోసమే యిలా అయిపోయిందన్న బాధతో, పశ్చాత్తాపంతో కాలిపోతున్నాను. చివరకి ఆమె దగ్గరకు వెళ్లాను. వందకేరెట్ల రత్నాన్ని చెక్కివెయ్యగా చెక్కివెయ్యగా మిగిలిన అణువులా ఆమె కృశించిన శరీరమూ, మొహమూ మెరుస్తోంది. నన్ను చూసి ఆమె పక్కకు తిరిగి పడుకుంది.

"బాలా"

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"నన్ను క్షమించు. ఒకటి చెబుతున్నాను. ఏనాడూ నా హృదయం నుండి నువ్వు తొలగిపోలేదు. నేను పిరికివాణ్ణి. కాని ఆజన్మాంతం నిన్ను మరిచిపోను. మనసా నేను నీ వాడిని."

ఆమె చెయ్యి చేతిలోకి తీసుకున్నాను. నా మాటలు ఆమె నమ్మలేదు. అవిశ్వాసంతో, ఆశ్చర్యంతో పెద్దవైన కళ్ళతో నన్ను చూసింది. నాకు కన్నీరాగ లేదు.

"వస్తాను బాలా" అని డగ్గుత్తికతో గబగబా ఆమెని విడిచి వచ్చేశాను.

ఒక నెల్లాళ్ళ తర్వాత ఆమె చనిపోయినట్టు తెలిసింది.

ఈ జ్ఞాపకాలతో నా వొళ్ళంతా వేడెక్కిపోయింది. ఊపిరాడనట్టనిపించింది. గది గోడలు దగ్గరంగా వచ్చి నన్ను నొక్కుతూన్నట్టు అనిపించింది. లేచి, గొడుగు తీసుకుని వీధిలోకి వచ్చేశాను. వాన యింకా కురుస్తూనే వుంది. స్వేచ్ఛగా, విశాలంగా తిరిగి వస్తేనే కాని ప్రాణం కుదుటపడుతుందనిపించలేదు. కాలవ వారనే బయలుదేరి వెళ్ళుతున్నాను. కాలవ అవతల మా పొలాలున్నాయి. తెలవారిపోతోంది. వాన నీటికి రాత్రి వొంటి రంగు కరిగి తెల్లబడుతూన్నట్టుగా వుంది. రేగడి మట్టి కాలి జోళ్ళకి అంటుకుని బరువుగా అడుగులు వేస్తున్నాను. చల్లని గాలి రివ్వుమని తగులుతూంటే కొంత ఉత్సాహం కలిగింది. ఆకాశం మబ్బులతో నిండి వుంది. కాలవ వారనున్న చెట్ల ఆకుల మీదనుంచి జల్లుమని జడి పడుతోంది. కాకులు అరుస్తూ అటూ యిటూ పోతున్నాయి. కాలవ అవతలి వైపున అరటి తోటలూ, వరి చేలూ పొడుగ్గా పరచుకొని అందంగా వున్నాయి.

కర్ర వంతెన వచ్చింది – వంతెన కింద కాలవ సుడి తిరుగుతూంటే కొంత సేపు చిత్రంగా చూశాను. వంతెన దాటి పొలం గట్టునే వెళుతూంటే "ఏవండోయ్" అన్న పిలుపు వినిపించింది. వీరన్న మామిడి తోటలోంచి ఆ పిలుపు. తోటలో పైన గడ్డి కప్పిన యిటికల యింటి ముందరుగుమీద ఎవరో ఆడ మనిషి నిలుచుంది. నన్నేనా అనుకున్నాను. తోటలోకి రెండడుగులు వేశాను. అరుగుమీద చామన చాయగా, బొద్దుగా, పొడి పొడిగా ఉన్న జుట్టు బుగ్గల మీద పడుతూంటే నవ్వుతూ సుబ్బులు.

జ్యోతి

ఈ పై చిత్రానికి పాఠకులు పంపిన రైటప్‌లలో బాగున్నవాటిని ఈ క్రింద ప్రచురిస్తున్నాము:

1. ప్రళయం తరవాత

పంపినవారు: పాలెపు నరసింహం, ద్రాక్షారామ; అక్కపెద్ది శ్రీకృష్ణమూర్తి, తెనాలి.

2. యుగాంతానంతరం

పంపినవారు: అ. దుర్గాదేవి, రాజమండ్రి.

3. మూడవ ప్రపంచయుద్ధం తరవాత

పంపినవారు: పి. గవర్రాజు, విశాఖపట్టణం.



మంచి బిగువుగా, ఆరోగ్యంగా ఉన్న యౌవనం అసూయని కలిగించేటట్టు వుంది. సుబ్బుల్ని నేను చిన్నతనం నుంచీ ఎరుగుదును. అయిదో క్లాసు వరకూ నాతో కలిసి బళ్ళో చదువుకుంది. అయినా ఆమె నాకన్నా చిన్నదిగా, చాలా చిన్నదిగా వుంది. పాతికేళ్ళంటే నమ్ముతారు సుబ్బులు వయస్సు.

"ఎప్పుడొచ్చావు సుబ్బులూ...."అన్నాను నవ్వుతూ.

"రావయ్యా లోనకి రా. వర్షంలో తడుస్తా ఎంతసే వుంటావ్."

నేను తటపటాయించాను.

"ఎవరూ సూడ్డం లేదులే. అబ్బో. మా పెద్దమనిషివైపోయావు." కనుబొమ ఎగరవేసి చేతులూపుకుంటూ అంది. నేను లోనికి వెళ్ళాను. సుబ్బులు ఇంట్లోంచి ఒక కుర్చీ తీసుకు వచ్చి వేసింది.

"సిన్నప్పుడు నువ్వీ దారిని యెల్తావుంటే చెరుకు పానకం యిచ్చేదాన్ని. గ్యాపకం వుందా. ఎప్పుడేనా సాటుగా ముద్దెట్టుకుంటావేమో అనుకునే దాన్ని. అయ్యో రాత ఆ సరదామే లేదు...." పక్కున నవ్వుతోంది.

నాకు సిగ్గుగా బెదురుగా వుంది. ఆమె ముందు నేను ముడుచుకుపోతున్నాను.

"అలా సిగ్గుపడుతూ కూర్చో. కొంచం కాఫీ కాచి తీసుకొస్తాను," అంటూ లోపలకు వెళ్ళింది. సుబ్బులు యాసనీ, నాగరికాన్ని కలిపి మాట్లాడుతుంది. అలాగే ప్రవర్తిస్తుంది. పట్టణాల్లో చాలాకాలం వుంది.

సుబ్బులు మొహంలో విచారం తాలూకు నీడ కాని, వయస్సు తాలూకు నీరసం కాని లేదు. జీవితంలోంచి ఎంతో సుఖాన్ని, స్వేచ్ఛనీ పొందినవాళ్ళు తప్ప అంత

హాయిగా నవ్వలేరు. ఆమె నాకన్న మూడేళ్లు చిన్నదైనా పదిహేనేళ్ళు చిన్నదిలా కనపడుతోంది. వింతగా ఆలోచిస్తున్నాను ఆమెను గురించి.

ఆమె కాఫీ తెచ్చి యిచ్చింది. కాఫీ మంచి రుచిగా వుంది. నా ఎదురుగా ముక్కాలిపీటమీద కూర్చుని జుట్టు విప్పుకుంది. నల్లని జుట్టు వొత్తు వొత్తుగా తరంగాలుగా పిరుదులదాకా ప్రవహిస్తోంది. కళ్ళల్లో ఆరోగ్యపు వెలుతురు. ఆందోళనలు లేని వెలుతురు.

“ఏడెనిమిదేళ్ళయింది నిన్ను చూసి సుబ్బులూ. రంగడు కులాసామేనా.” అన్నాను ఆమె భర్త నుద్దేశించి.

ఆమె మళ్ళీ విరగబడి నవ్వింది. “రంగడా! ఇంకా ఆడెక్కడ? బలేవాడివయ్యా తెలియనట్టు మాటాడుతావ్” అంది.

“ఏం, రంగడు పోయాడా.” ఆత్రుతగా అన్నాను.

“ఛఛ — దుక్కలా వున్నాడు. నే నే వాడిని వొగ్గేశాను.”

“ఏం?”

“నా కిష్టం లేకపోయింది. భయమా?”

“ఇన్నాళ్లూ మరి ఏం చేస్తున్నావు.”

“వీరాస్వామితో గుంటూరు వెళ్ళిపోయాను. అతను పెద్ద మేస్త్రీ. మాంచి డబ్బున్నవాడు కూడా.”

“అతన్ని పెళ్ళి చేసుకున్నావా.”

ఆఁ—గుంటూరులో మాబలేగా వుండిలే. నగలూ బట్టలూ సినీమాలూ- ఓఁ దర్జాగా వుండేది. వీరాసామి కూడా బాగుండే వాడు. కాని....

“అతనితో కూడా చెడిందా.”

“అతను దేన్నో మరిగాడు. నాకు శానా కోపం వచ్చింది. నీకింటి దగ్గర దెబ్బలు తిని శాకిరీ సెయ్యడానికి నేనేం యెదవని కానని చెప్పి నా నగలూ డబ్బూ తెచ్చుకుని వేరే వెళ్ళిపోయాను.”

“ఇప్పుడు కలుసుకున్నారా. మళ్ళీ—”

“ఆడినీ ఒగ్గేశాను.”

నేను తెల్లబోయి చూస్తున్నాను.

“అదేంటలా చూస్తావ్! యిష్టంలేని వాడితో కాపురం చేసి ఏడుస్తా చావనా? నా దగ్గర అటువంటిది లేదయ్యోయ్. బతికినన్నోళ్లు కులాసాగా బతుకు. నా కన్నాయం ఒహారు చేస్తే ఊరుకునేది లేదు.”

“మరి యిప్పుడొకర్తివే ఉన్నావా?”

“నువ్వున్నావు కాదయ్యా. నీకోసమే వచ్చినాను. అబ్బ. నువ్వంటే నేటికీ మననే నాకు, పాడు మనసు...” గమత్తుగా చూస్తూ పవిట కొంగు నోటికి అడ్డం పెట్టుకు నవ్వుతోంది.

“బాగుంది నీ హాస్యం” అన్నాను నేను సిగ్గుపడుతూ.

“బెజవాడ రైల్వేలో పనిచేస్తున్నాడు. రాఘవులు. ఆతనితో వుంటున్నా” అంది మళ్ళీ.

“మనువా?”

“మనువూలేదు శ్రాద్ధంలేదు. నా కంటె సిన్నోడు. అయినా మా అందగాడు. స్టోర్సులో పనిచేస్తున్నాడు. నేనంటే పల్లి మాలిన ఆపేక్ష రాఘవులికి. నొక్కుల జుట్టుతో చిన్న పెదాలతో బలే అందంగా వుంటాడు.” అంది ఆప్యాయత కళ్ళల్లో కనపడేటట్టు. నేను లేచాను. కోర్టు పని వుంది. ఇవాళ ఎన్నో కాగితాలు చూసుకోవాలి.

“ఇంకా ఉంటావా సుబ్బులూ.”

“మా బాబుని చూసి పోదామని వచ్చాను. రేపో ఎల్లుండో వెళ్ళిపోతాను.”

“ఓసారి మా యింటికిరా. మా ఆవిడకు కనిపించు.” అంటూ అరుగు దిగాను.

“నే నెందుకొచ్చి చూస్తానూ నాసయితీ! సర్లే. ఒక్కసారైనా నా కోరిక తీర్చలేదు. అందమైన వాడినని నీకు గర్వం లేవయ్యా.” నవ్వుతూ చేతు లూపుతూ అంది.

వానలో తిరిగి యింటికి బయల్దేరాను. ఆమెలో ఆనందానికీ, ఆరోగ్యానికి నవనవోన్మేషతకీ కారణం ఏఁవిటా అని ఆలోచిస్తున్నాను. జీవితాన్ని తేలిగ్గా సహజంగా తీసుకోవడమా? కృత్రిమమైన నీతులూ భయాలు పెద్దరికాలూ అడ్డురాక పోవడమా? ఇంత చదువూ డబ్బూ వుండి నాలో యీ అసంతృప్తి దిగులూ ఏఁవిటి? ఏదో చెయ్యలేక పోయానన్న వేదన. కలలు కాగితపు పేలికల్లా రాలిపోయిన క్షోభ. చెంపల దగ్గర నెరిసిన జుట్టు క్రమంగా అంతటా తెల్లబడి ముసలివాణ్ణీ, మృత్యు పదాభిముఖుణ్ణీ అయిపోతున్నానన్న బెదరూ ఏమిటి యిదంతా? ఎక్కడ నేను జీవిత రహస్యాన్ని మరచి పోయాను? ఏ సమయంలో జీవించడంలోని కీలకం జారిపోయింది? ఈమె—చదువూ, సంస్కారమూ లేని సుబ్బులు ముందు నేను చాతకాని వాడిలా ఎందుకయిపోయాను.?

బరువుగా బాధగా అడుగులు వేసుకుంటూ కర్ర వంతెన దాటాను. కాలవ వారనే జనం బాగా తిరుగుతున్నారు. వర్షానికి కాకులు తడుస్తూ చెట్ల కొమ్మలమీద వణుకుతూ కూర్చున్నాయి. మనసులో ఆలోచన హెచ్చినకొలదీ అడుగులు వేగంగా వేస్తున్నాను. జీవితపు పందెంలో ఓడిపోయిన వాడిని. — ●

శ్రీశ్రీ ఉవాచ

ఒక తెలుగు వారపత్రిక కార్యాలయం, మదరాసు,
సంవత్సరం : **1952.**
మధ్యాహ్నం పన్నెండయింది. ఎండ తీవ్రంగా ఉపన్యసిస్తోంది. శ్రీశ్రీ సంపాదకుని గదిలోకి వెళ్లాడు. “ఏం అన్నా! ఇంకా భోజనానికి వెళ్లలేదా?” అన్నాడు. “ఇదిగో ఈ కవరుపేజీ సంగతి ఇంకా తేలలేదు. కొచ్చిన్ సిస్టర్సు ఫొటో వేద్దామా వద్దా అని చూస్తున్నా” అన్నాడు సంపాదకుడు.
“ఎందు కొచ్చిన్ సిస్టర్స్? పద భోజనానికి” అన్నాడు శ్రీశ్రీ.

పంపినవారు : గోపాల చక్రవర్తి.